# తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ, కార్మిక సంఘాలు

## రాష్ట్ర కమిటీలు

ప్రచార/ప్రచురణార్థం　　　　　　　　　　　　　　　　　　　　　తేది : 03-02-2021

## 4 కార్మిక కోడ్‌లు, 3 వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలి.

## కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను దోచిపెట్టే 2021-22 బడ్జెట్‌ను వ్యతిరేకించాలని కోరుతూ

# ఫిబ్రవరి 3న రాష్ట్ర ధర్నా

కేంద్ర బిజెపి ప్రభుత్వం గత ఏడేళ్ళుగా అనుసరిస్తున్న సరళీకృత ఆర్థిక విధానాలకు కొనసాగింపుగానే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 2021-22 కేంద్ర బడ్జెట్ రాష్ట్ర కార్మికవర్గానికి, పేద, మధ్యతరగతి ప్రజానీకానికి తీవ్ర హాని కలిగించేదిగా ఉన్నది. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే ఈ ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను రాష్ట్రంలోని యావత్ కార్మికవర్గం తీవ్రంగా వ్యతిరేకించాలని **తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ, కార్మిక సంఘాలు పిలుపునిస్తున్నాయి.** మోడీ సర్కార్ పాలనలో వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాలు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయి. కరోనా కష్టాల్లోనూ ప్రభుత్వ రంగాన్ని బలహీనం చేసి కోట్లాది కార్మికవర్గానికి ఉపాధిని మోడీ సర్కార్ పోగొట్టింది. విదేశీ, స్వదేశీ గుత్త సంస్థలకు వేల కోట్లు లాభాలు కట్టబెడుతూ ఆర్థిక వ్యవస్థను మరింత సంక్షోభంలోకి నెట్టింది. ఈ సంక్లిష్ట పరిస్థితుల్లో కార్మికవర్గ హక్కులను కాలరాసే విధంగా 4 లేబర్ కోడ్‌లను, వ్యవసాయ రంగాన్ని ధ్వంసం చేసే 3 నూతన వ్యవసాయ చట్టాలను, విద్యుత్ సవరణ బిల్లు 2020ని రద్దు చేయాలని కోరుతూ దేశవ్యాప్తంగా కార్మిక, ఉద్యోగ సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా ఈరోజు (ది.03-02-2021) తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ కార్యాలయం (అంజయ్య భవన్) వద్ద నిరసన ధర్నా, రాష్ట్రంలోని అన్ని జిల్లాల డిప్యూటీ లేబర్ కమీషనర్, అసిస్టెంట్ లేబర్ కమీషనర్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు స్వస్తి పలకకపోతే మరిన్ని సమరశీల ఉద్యమాలు చేపట్టాల్సి వస్తుందని కార్మిక, ఉద్యోగ సంఘాలు కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాయి.

ఎల్ఐసిలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను 49 శాతం నుండి 74 శాతానికి పెంచి సంస్థను విదేశీ యాజమాన్యాలకు అప్పగించింది. వ్యూహాత్మక భాగస్వామ్యం పేరుతో పెట్టుబడుల ఉపసంహరణను ప్రభుత్వరంగ సంస్థల్లో 1.75 లక్షల కోట్లు లక్ష్యంగా నిర్ణయించి ప్రభుత్వరంగాన్ని ధ్వంసం చేయడానికే నిశ్చయించుకున్నది. ఒక జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీని, రెండు పబ్లిక్ సెక్టార్ బ్యాంకులను అమ్మేయాలని ప్రతిపాదించింది. గత మూడేళ్ళలో రూ.1.20 లక్షల కోట్లు పబ్లిక్ రంగ బ్యాంకులకు కేటాయించడమే కాకుండా, ఈ బడ్జెట్‌లోనూ రీక్యాపిటలైజేషన్ పేరిట రూ.20 వేల కోట్లు కేటాయించడం కార్పొరేట్ మొండి బాకీలు రద్దు చేస్తూ పబ్లిక్ సెక్టార్ బ్యాంకింగ్ వ్యవస్థను ధ్వంసం చేయడానికే దారి తీస్తుంది. పెట్టుబడుల ఉపసంహరణకు ప్రత్యేక డ్యాష్ బోర్డు ఏర్పాటు నిర్ణయం సరళీకృత విధానాలకు పరాకాష్ట. నాలుగు లేబర్ కోడ్‌లను అమలుపరుస్తామని చెబుతూ అన్ని రంగాల కార్మికులకు కనీస వేతనాలను అమలు చేస్తామని ప్రకటించడం పచ్చి మోసం. అసంఘటిత రంగంలో కీలకమైన నిర్మాణ రంగం పుంజుకోవాలని చెబుతూనే అందుకు తగిన ప్రోత్సాహకాలు ఈ బడ్జెట్‌లో ప్రకటించక పోవడం అన్యాయం. చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ఆదుకోవాలని దేశవ్యాప్తంగా బలమైన ఒత్తిడి ఉన్నప్పటికీ కేవలం రూ.15,700 కోట్లు మాత్రమే కేటాయించి ఎంఎస్ఎంఇలకు ద్రోహం తలపెట్టింది. కరోనా కాలంలో తీవ్రంగా ఉపాధి కోల్పోయిన ట్రాన్స్‌పోర్ట్, భవన నిర్మాణం, వలస కార్మికులు తదితర కోట్లాది మంది అసంఘటిత రంగ కార్మికులను ఆదుకునే ఏ చర్యా ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించలేదు. అంగన్‌వాడీ, ఆషా, మధ్యాహ్న భోజనం, నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు, ఉపాధి హామీ తదితర స్కీమ్‌లను బలోపేతం చేయడం గానీ, ఉద్యోగ భద్రత గురించి గానీ ప్రస్తావించకపోవడం శోచనీయం.

**పెట్రోల్, డీజిల్ ఛార్జీలు నిత్యం పెరుగుతూనే ఉన్నప్పటికీ బడ్జెట్‌లో కూడా ఈ భారాన్ని మరలా వేయడం కోట్లాది ప్రజలపై మరిన్ని భారాలు పెరగడానికే దారితీస్తాయి. నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించడంలోనూ, ప్రజల కొనుగోలు శక్తి పెంచడంలోనూ ఘోరంగా విఫలమైన మోడీ సర్కార్ విధానాలపై కార్మికులు, కర్షకులు, సేవా రంగాల్లోని ఉద్యోగులు ఏకతాటిపైకి వచ్చి సమరశీల ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావడమే సరైన పరిష్కారమని ఆ దిశగా అందరూ కలసిరావాలని రాష్ట్ర ఉద్యోగ, కార్మిక సంఘాలు పిలుపునిస్తున్నాయి. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలని, అసంఘటితరంగ కార్మికులకు బడ్జెట్‌లో రూ.10,000/-లు చెల్లించేలా కేటాయింపులు చేయాలని, కార్మిక, కర్షక, ప్రభుత్వరంగ సంస్థల వ్యతిరేక బడ్జెట్‌ను సమూలంగా మార్చాలని, మోడీ కార్పొరేట్ విధానాలను విరమించుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ, కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.**

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| ఆర్.డి. చంద్రశేఖర్<br>నాగన్న | వి.ఎస్. బోస్<br>నరసింహన్ | పాలడుగు భాస్కర్<br>జె. వెంకటేష్ | ఉదయభాస్కర్‌రావు | ప్రవీణ్ | ఎం.కె. బోస్ | ఎం. శ్రీనివాస్ | బాబూరావు |
| INTUC | AITUC | CITU | HMS | IFTU | TNTUC | IFTU | AIUTUC |

**ఇన్సూరెన్స్, బ్యాంకింగ్, రక్షణ, ఫార్మా రంగం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ ఉద్యోగుల ఫెడరేషన్లు**

(వై. సోమన్న)
రాష్ట్ర కమిటీ సభ్యులు